

# ఉషోదయం

యం. ఆర్ కృష్ణ

మెయిన్ బజారులో వోసందు మొదట్లో వున్న షాపు ముందున్న బోర్డు — "వైసీ టైలర్స్" ప్రొ॥ వై. చిన్నారావు - చూసి రిక్షా దిగి డబ్బులిచ్చేను. అద్దాల బీరువాల్లో బయటకు కనపడేటట్లు వరుసగా ఫాంట్లు, షర్టులూ హేంగర్స్‌కి వేలాడదీయబడ్డాయి సాయంకాలం కాస్త చల్లబడ్డదేమో కష్టమర్స్‌తో లోపల రష్‌గా వుంది లోపలకు అడుగు పెట్టి అంతా కలియచూసేను. ఓ అర డజను కుట్టుమిషన్లు జోరుగా తిరుగుతూ కోలాహలం చేస్తున్నాయి ఆ హాలు లాంటి గదిలో మధ్యలో సగం కుట్టిన కొత్తబట్టలు ముందువేసుకుని పన్నెండేళ్ళు దాటని వో నలుగురు కుర్రాళ్ళు చేతితో కుడుతున్నారు. అందులో వో కుర్రాడ్ని పిలిచి చిన్నారావులేడా అని అడిగేను. హాలుకి ఆనుకునివున్న సందు లాంటి మార్గము చూపించి అటు వెళ్ళమన్నాడు ఆ మార్గము చివర రెండు చిన్నగదులు వొకదానివెనుక వొకటి వున్నాయి. ముందుగదిలో వొకసోఫా, నాలుగైదు కుర్చీలు, వొక గాడ్రెజ్ టేబిలూ వున్నాయి టేబిల్ వెనక కుర్చీలో చిన్నారావు కూర్చుని, వో కుర్రాడు టేపుతో కష్టమరు కొలతలు తీసుకుంటుంటే నోట్ చేసుకుంటున్నాడు. మధ్యమధ్య కొలతలు తీసేకుర్రాడికి యేవో డైరెక్షన్స్ యిస్తున్నాడు. వీళ్ళుకాక గదిలో యింకా కొంతమంది కూర్చుని వున్నారు. వెనుక

గదిలో యెత్తుగావున్న టేబిల్స్ ముందు నుంచుని యిద్దరు గుడ్డలు కత్తిరిస్తున్నారు. చిన్నా నా రాకను గమనించడానికి పది నిమిషాలు పట్టింది. చూడగానే అమాంతం లేచొచ్చి నన్ను కౌగలించుకున్నంత పనిచేసాడు. కుశల ప్రశ్నలయ్యాక వో కుర్రాడ్ని పిలిచి నాతోపాటు అక్కడున్న కస్టమర్స్‌కి గోల్డ్ స్పాట్ తెప్పించి యిచ్చేడు. నాతో అవీయివీ మాట్లాడు తూనే తనపని తను చేసుకుంటున్నాడు. కొంత మంది కొలతలు యివ్వడాని కొస్తుంటే కొంత మంది డబ్బిచ్చి కుట్టిన గుడ్డలు తీసికెళ్ళడానికి వస్తుండ డంతో వాడితో మాట్లాడం కష్టమని పించింది.

ఓ అరగంట తరువాత "మా సేవుగా క్షణం తీరిక దొరకడంలేదు. అసలే పెళ్ళిళ్ల సీజను. పెళ్లి చేసికుని నాల్రో జుల్లో వొచ్చేస్తానన్న మా అసిస్టెంటు గాడు పదిరోజులై నా పెళ్లాన్నొదిలి రాలేక పోతున్నాడు. ఇంటికెళ్ళి అన్నం ముందు కూర్చునేటప్పటికి రోజూ అర్ధరాత్రి దాటి పోతుంది" అని నాకూ, కస్టమర్స్‌కి కలిపిచెప్పినట్టు చెప్పేడు.

కాస్త ఖాళీ దొరికింతరువాత నన్ను తీసుకుని బయట హాల్లోకి వొచ్చి వో కుర్రాడ్ని పిలిచేడు. "సత్యం! నాతో పెట్టుకూర్చుంటే లాభంలేదు కాని ప్రొద్దున్నే ఎప్పుడు బయలుదేరావో యేంవిటో, యింటికెళ్ళి స్నానంచేసి భోజనంకూడ కానిచ్చి రెస్టుతీసుకో ఈ రోజు తొందరగా షాపు కట్టేసి పదింటి కల్లా వొచ్చేస్తాను." అని నాతోచెప్పి "ఒరేయ్ శివా! అయ్యగారిని యింటికి తీసికెళ్ళి స్నానం భోజనం చూడమన్నా నని అమ్మగారితో చెప్పు." అని కుర్రాడికి చెప్పి వోరిక్షా పిలిచేడు.

వాడొచ్చేవరకూ అక్కడ [illegible] రొప్పే దానికి నా కభ్యంతరంలేదని చెప్పేను కాని వాడు వినకుండా నన్ను రిక్షా యెక్కించాడు.

వాళ్ళిల్లు అట్టహాసంగా లేకపోయినా పొందికగావుంది. చిన్నాభార్య సౌభాగ్యం ముందు నన్ను గుర్తుపట్టలేదు కాని చిన్నాతో నా పరిచయం గుర్తుతేగానే తన మతిమరుపుకు యెంతో బాధపడింది. మా ఆవిడ సరళ గురించి, పిల్లలగురించి వివరాలు తెలుసుకుంది. వాళ్ళ కుటుంబ విశేషాలు కూడ చెప్పింది రెండేళ్ళ క్రితం చౌకలో వొస్తే ఆ యిల్లు కొను క్కున్నారట. పెద్దబ్బాయి కూడ వాళ్ళ నాన్నతోనే వుండి యీ మధ్యే వేరే షాపు పెట్టేడట. వాడిపని బాగానే వుందట. రెండోవాడికి చదువు మీద శ్రద్ధ యెక్కువట' ఈ యేడు ఇంట రయిపోయాక యింజనీరింగు చదివిం చాలని అనుకుంటున్నారట. మూడోది అమ్మాయి సినిమాలు తప్ప యేంవీ అక్కర్లేదట. టెన్త్ చదువుతుందట. నే వెళ్ళేసరికి ఆడపిల్ల వొక్కర్తేవుంది.

మగపిల్లలు యింటిలో లేరు పెద్దాడికి మంచి సంబంధంవొస్తే యీ సంవత్స రంలో పెళ్ళి చెయ్యాలనుకుంటున్నారని కూడ చెప్పింది.

స్నానంచేసేక చిన్నా వొచ్చేవరకూ ఆగుతానన్నా వినకుండా ఆలశ్యమయి పోతుందంటూ నాకు భోజనం వడ్డించింది. తరువాత సెపరేట్ గా వీధివైపున్న గదిలో పక్కవేసి "కాసేపు పడుకోండి. ఆయనొస్తే ఆ ముచ్చటా యీ ముచ్చటా చెబుతూ తెల్లార్లూ వొదిలిపెట్టరు" అని చెప్పి లోపల పని చూసికోడానికి వెళ్ళిపోయింది చిన్నా భార్యా.

మంచమీద పడుకుని చిన్నా జీవితంలో వొచ్చిన మార్పు చూస్తే తెలియని ఆనందం గుండెలనిండా నిండిపోయింది. ఎందుకో నా క్కొంచెం గర్వంగా కూడ వుంది

ఆ రోజు నాకు బాగా గుర్తు.

తెల్లవారు ఝూమున నా ఇంటికి మాయింటి తలుపులు దబ దబా చప్పుడవుతుంటే శుభ్రమైన నిద్ర చెడ గొట్టినందుకు విసుక్కుంటూ బద్ధకంగా తలుపు తీసాను. చెదిరిపోయిన క్రాపుతో యెర్రబడిన కళ్ళతో రాత్రంతా నిద్ర లేనట్టు నీరసంగా చిన్నా నిలబడి వున్నాడు యెదురుగా. ముందు రోజు సాయంకాలం మా ఆఫీసు విడిచిపెట్టే టయిమ్కి నాదగ్గర కొచ్చేడు. అదీ యిదీ మాట్లాడుకుంటూ కాస్సేపు బజారులో తిరిగి విడిపోయాం. మరీ తెల్లవార కుండానే రావడం వింతగానే వుంది. వాడి వాలకం చూస్తే కొంచెం భయం వేసింది

"ఏవిటి.... ఏమైందిరా? అలా వున్నావేం? రాత్రంతా నిద్రపోలేదా? ఆతృతగా అడిగేను.

"సత్యం. వెరీ సారీరా! యింత పొద్దున్నే డిస్టర్బ్ చేస్తున్నందుకు యేమీ అనుకోకు. షర్టువేసుకుని వొస్తే వొక్క ఐదు నిముషాలు అలా బయటకు వెళ్దాం. నీతో శాస్త్ర ముఖ్య విషయం మాట్లాడాలి." అన్నాడు.

ఆ మాట్లాదేది యిక్కడే కూర్చుని మాట్లాడకూడదా అనాలనుకున్న వాడినల్లా వాడి మొహం చూసి మౌనంగా షర్టు తొడుక్కుని శ్రీమతిని తలుపేసు కోమని బయటకు నడిచేను. ఆశ్చర్యంతో కూడిన విసుగును ప్రదర్శించింది సరళ తలుపు వేసుకుంటూ.

ఐదు నిముషాలు మౌనంగా నడిచి వీధి చివర అప్పుడే తెరిచిన హోటల్లో వోమూల కూర్చున్నాం. రెండు టీ ఆర్డరిచ్చి వాడి మొహంలోకి చూసాను విషయమేవిటో చెప్పమన్నట్టు.


సత్యం! ఇలా యేపనీ లేకుండా అందరితో ఛీ అనిపించుకుంటూ యింక బ్రతకలేను. అందుకే వో నిశ్చయానికి వొచ్చేను. నాలుగేళ్ళనుంచీ చూస్తూనే వున్నావుగా. ఇక వుద్యోగం రావడ

మనేది కలలో మాట. ఏదేనా వ్యాపారం చెయ్యాలన్నా చేతిలో పైసలేనిది యెలా కుదురుతుంది. మరింకేం చెయ్యగలను. సినిమాల్లో చూపించినట్టు బి. ఏ. డిగ్రీ చేతితో పట్టుకుని రిక్షాలు తొక్కలేను లేకపోతే బరువులు మొయ్యలేను. అందుకే బాగా ఆలోచించి నాకు సాధ్యమయ్యింది నేను త్వరగా నేర్చుకో గలిగింది టైలరింగని నిర్ణయానికొచ్చాను. నా ఆలోచన చెప్తే అందరూ నవ్వుతారని తెలుసు. అందుకే యెవ్వరికీ, ఆఖరుకి మా అమ్మకి కూడ చెప్పదలచుకోలేదు. నా కాళ్ళమీద నేను నిలబడి నప్పుడే చెబుతాను. దీనికంతకూ యిన్స్పిరేషన్ జగన్నాధరావుగారిని నువ్వు గుర్తించే వుంటావు. ఇన్నాళ్లూ యెంత అజ్ఞానంలో వున్నానో ఆయన మాటలు విన్నాకే తెలిసింది. ఇప్పుడు నా కాలాన్ని వృధా చేయదల్చుకోలేదు. ఈ వృత్తిద్వారా నన్ను నమ్ముకున్న వాళ్ళకు వో పూటైనా తిండిపెట్ట గలననిపిస్తుంది" అని యేమంటావ్ అన్నట్టు కొన్ని క్షణాలు నావంక చూసాడు.

వాడి మాటలు వింటూ యేంచెప్పాలో తెలియక పొగలు కక్కుతున్న టీ వొంక చూస్తూ కూర్చున్నాను.

"నువ్వు యింతవరకూ నీ శక్తికిమించి సహాయంచేసావ్. మన స్నేహాన్ని యీ డబ్బు చెడగొట్టకుండా చూసేవు నువ్వే నాకు ధైర్యంచెప్పి, ఆర్థికంగా సహాయం చెయ్యకపోతే నిరాశతో నా కెప్పుడో పిచ్చెక్కి పోయుండేది. ఇంతవరకూ నేను నీకు అదనపు భారంగానే వుంటూ వొచ్చేను. ఇప్పుడుకూడ యింకొంత భారం నీ మీద మోపడం నాకిష్టంలేదు. కాని నేను అసమర్థుణ్ణిరా. నా అసహాయతకు మన్నించు." అంటూ నా చేయి నొక్కేడు. వాడి కళ్ళల్లో చివుక్కున నీరు చిమ్మింది. ఆ పరిస్థితికి నాకూ విపరీతమైన బాధకలిగింది. మాటలు రాక వూరుకున్నాను.

ఈ రోజే మద్రాసు వెళ్దామనుకుంటున్నాను. అక్కడ వో టైలర్ కి మన టైలర్ అప్పారావు లెటర్ యిస్తానన్నాడు. నేనెవరో తెలియని మనుషుల మధ్య ధైర్యంగా క్రొత్తజీవితం ప్రారంభిస్తాను. పని నేర్చుకోవాలంటే కనీసం నాలుగైదు నెలలన్నా అక్కడ వుండాలి. వెళ్ళడానికి, వెళ్ళింతరువాత వేరే దారి చూసుకునే వరకూ కనీసం వో వంద రూపాయిలన్నా కావాలి. అవి నువ్వే సర్దాలి. అక్కడ కెళ్ళింతరువాత నా తిప్పలు నేను పడతాను. మరీ కష్టమైతే నువ్వు నెలకోయాభై అన్నా పంపించాలి ఆ అవసరం రాదనుకో. ఇలా సిగ్గు విడిచి అడుగుతున్నానని తిట్టుకుంటున్నావా? నీ కొచ్చే జీతం డబ్బులతో నీ బ్రతుకీడ్చడమే కష్టమనీ, వదినకు మందులకూ డాక్టర్ ఫీజులకూ అదనంగా యీ నాలుగు నెలలు ఖర్చులుంటాయని




నాకు తెలుసు. యెందుకడుగుతున్నా వంటే.... కష్టమయినా నాకీసహాయంచేసే సహృదయం కలవాడివి నువ్వొక్కడివే. నాయీ కొత్త జీవితం నీ చేత్లోనేవుంది." అని యెంతో బాధపడుతూ చెప్పేడు.

వాడి నిర్ణయానికి నాకు చాలా సంతోషం వేసింది. ఎలాగైనా వాడికి యీ సహాయం చెయ్యాలనిపించింది. కాని నామీద పెట్టిన ఆర్థికభారం మొయ్యడం కష్టమనిపించింది. స్నేహితుడికి చేసింది చెప్పుకోకూడదుగాని వాడికి నేను నెల నెలా అంతో యింతో సర్దుతూ నే వున్నాను. అందుగురించి మా ఆవిడకూ, నాకూ యీమధ్య భేదాభిప్రాయా లేర్పడ్డం తన్మూలంగా చిన్న చిన్న కలతలు రావడం కూడా జరిగింది. అదీ కాక సరళకిప్పుడు ఆరోనెల. చిన్నా అన్నట్టు డాక్టరుకి చూపిస్తే నీరసంగా వున్నదంటూ మందులు రాసిచ్చి రెగు లర్‌గా వాడమంది. నెలనెలా వొచ్చి పరీక్ష చేయించుకొమ్మంది వీటికోసం కొంత అప్పు చేయాల్సొచ్చింది. చేతి కొచ్చే జీతంలో నూటపాతిక పాలి టెక్నిక్ కోర్స్ చదువుతున్న తమ్ముడికి నెలనెలా పంపించాలి. చిన్నాకి ప్రస్తుతం వంద సర్దడం మాట అటుంచి నెల నెలా పంపించే నా తరం కాదనే చెప్పాలి.

ఉపయోగపడని ఆలోచనలు వూపిరి సలపకుండా ముసురుతుంటే యేం మాట్లాడలేకపోయాను. నా మౌనాన్ని వాడు యెలా అర్థంచేసుకున్నాడో గాని "సారీరా బ్రదర్. ప్రొద్దున్నే నిన్ను యిలా యిరకాటంలో పెట్టినందుకు మన్నించు. ఈ నాలుగేళ్లూ యెందుకూ పనికిరాకుండా గడిపినందువల్ల జగన్నాథ రావుగారి మాటలతో వుత్తేజితుడినై యేదో సాధించేయాలనుకుని వెనకా ముందూ ఆలోచించకుండా యిలా వొచ్చే సేను. అందువల్ల నీ యిబ్బందుల్ని ఆలోచించలేక పోయాను. నీకంటే యెవరు మాత్రం సహాయం చెయ్య గలరు! ఈ విషయం మర్చిపో నేను

యెక్కడైనా యితరత్రా దొరుకుతుందేమో ట్రై చేస్తాను. అంతగా యెక్కడా దొరక్కపోతే అప్పుడే యేదో ఆలోచిద్దాం." అంటూ లేచాడు .

ఆ మాత్రం సహాయం ఆ పరిస్థితిలో వున్న చిన్నాకు చెయ్యకపోతే మా అనుబంధానికి విలువలేదనిపించింది బిల్లు చెల్లించి బయటకొచ్చేక రోడ్డుమీద నడుస్తూ ఆ డబ్బు నేను సర్దుతానని, వాటిని వర్రీ అవ్వొద్దని చెప్పినపుడు వాడి మొహంలో తిరిగొచ్చిన కాంతి చూసి నాకూ ఆనందమయ్యింది నన్ను కౌగిలించుకున్నంత పని చేసాడు.

చిన్నాని అంతగా ఉత్తేజపరిచిన జగన్నాధరావుగారు గుర్తు కొచ్చేరు. ఆయన ఆంధ్రదేశంలో ప్రఖ్యాతి గాంచిన యిండస్ట్రియలిస్టూ, వ్యాపారవేత్తాను. కొన్ని కోట్లకు అధిపతి. నాలుగు రోజుల క్రిందట లోకల్ క్లబ్‌లో ఆయనకు సన్మానం చేసారు. అదేమీ సినిమాస్టార్సుకి గాని, రాజకీయవేత్తలగ్గాని జరగబోయే సన్మానం కాదు కాబట్టి ముందు నేను వెళ్లాలనుకోలేదు. కాని సన్మాన సంఘంలో నా మిత్రుడొకడు మెంబరు కావడం వల్ల నన్ను రమ్మని మరీమరీ కోరినందువలన ఆ రోజు సాయంకాలం బయలుదేరాను. సరిగ్గా అదేసమయానికిచిన్నామాయింటికొచ్చేడు. ఆ రోజు వాడి మూడ్ అపలేం బాగా లేదు. ఇంటిదగ్గర వాళ్ళ అమ్మకు, ఆవిడకు పెద్ద పోట్లాట యే కారణమూ లేకుండానే జరిగిందట. ఇద్దరూ కలిసి వొకరిమీద వొకరు వీడికి ఫిర్యాదు చేసుకున్నారట. ఎటు మాట్లాడితే యేం జరుగుతుందో అని వీడు మాట్లాడక పోయేసరికి వీడి అసమర్ధతని యిద్దరూ యెత్తి చూపేరట యింట్లో వుండలేక నా దగ్గరకొచ్చేడు ఆ ఆలోచనలనుండి వాడి దృష్టి మళ్ళిద్దామని నాతో తీసుకు వెళ్ళేను.

సినిమాలు కూడ టైముకి ప్రారంభించని మా వూరిలో ఆ రోజు సభ చెప్పిన టైమకే మొదలైంది. ఆ మాటే ప్రక్కన కూర్చున్నాయనతో అంటే సింప్లిసిటీ, పంక్చువాలిటీ జగన్నాధరావు గారి ఐదు, ఆరు ప్రాణాలని జోక్ చేసాడు.

ఆ పెద్దమనిషిని చూస్తే యేమీ యింప్రెసివ్‌గా లేదు. ఫలానా అని చెప్పి ఆయన ఆస్తి వివరాలు చెబితేనే గాని చాలామంది ఆయన్ని గుర్తించ లేరు. నాకు ఆశ్చర్యం వేసినది యింకొకటుంది. సన్మానం అన్నారు గాని వొక్క దండకూడ ఆయనకు వెయ్యలేదు. సన్మాన సంఘం తరపున వో చిన్నపాపతో వొక గులాబీ పువ్వు యిప్పించేరు. అది తీసికుని ముందు టేబిల్‌మీదున్న ఫ్లవర్‌వాజ్‌లో వుంచేరు దండలవీ వేస్తే అనవసరమైన ఖర్చు అని కోప్పడతారట. పురప్రముఖు

లంతా ఆయన త్యాగనిరతినీ, కార్యదీక్షనూ, నిరాడంబరత్వాన్నీ యెడాపెడా శోషొచ్చేవరకూ పొగిడేరు. చివరగా ఆయన కృతజ్ఞత తెలుపుకుంటూ, "ఇంతవరకూ మీకు తెలిసినవే వొకటికి పదిసార్లు విన్నారు. అదంతా మర్చిపోండి. దానివల్ల యెవరికీ యెటువంటి యిబ్బందీ వుండదు. కాని యిప్పుడు మీకు వొక కథ చెప్తాను. అది విని దాంట్లో యేమైనా పనికొచ్చేదుంటే గుర్తుంచుకోండి." అంటూ కథ మొదలు పెట్టేరాయన.

"అనగా అనగా మీ వూరు లాంటిదే వొక వూరు. అందులో యిరవై యేళ్ళు నిండిన వో కుర్రాడు. బరువూ, బాధ్యతలు మోసే వయసు కాదది. జీవితం వో రంగుల కలలాంటిదని ఆ కలల్లో యేది కావాలని కోరుకుంటే అది వొస్తుందని అపోహ పడే వయసే కాని, చూచుకుని నడవకపోతే బాటలోని తుమ్మముళ్ళు కాళ్ల చీరేసి కుదేస్తాయనీ, వాలు చూచుకుని ప్రయాణం చెయ్యకపోతే దూరం తగ్గకపోగా వెనక్కి కూడ పోవలసి వొస్తుందని పాపం అతని కింకా తెలియదు. హఠాత్తుగా తండ్రి పోవడంతో వొక్కసారి కలలన్నీ చెదిరిపోయాయి. ఆశలన్నీ ఆవిరైపోయాయి. బాధ్యతలు కొండచిలువల్లాగా వూపిరి సలపకుండా పెనవేసుకోవడం మొదలైంది. తండ్రి చేసిన అప్పులమీద వడ్డీలు వొళ్ళు పెంచేసుకుంటున్నాయి. ఇంట్లో యెదిగికూచున్న తోబుట్టువుకి పెళ్ళి చేయాలంటే కట్నమియ్యాలి. కట్నమివ్వాలంటే కట్నం తెచ్చుకోడం తప్ప మరో మార్గంలేదు. కట్నంతోపాటు వొచ్చిన పెళ్ళాం కోర్కెలనూ తెచ్చింది. కోర్కెలు పిల్లల్ని యిచ్చేయి. ఒక సమస్యను పరిష్కరించబోతే మరికొన్ని సమస్యలు యెదురయ్యాయి. తెలియకుండానే బరువు పెరిగిపోయింది. మధ్యలో ఆగిపోయిన ఆ చదువుకే యేదో పెద్ద వుద్యోగం వొచ్చేస్తుందని ఆశ. ఇంకా పైకి చదువుకున్నవాళ్ళే కటకట పడుతున్నారని తెలియని అమాయకత్వం అతనిది. ఎదురు చూడ్డంలో థ్రిల్ పోయింది. నెమ్మది నెమ్మదిగా పరిస్థితులు ఆకళింపులోకి వొస్తున్నాయి. ఎటు చూసినా పెను చీకటి తప్ప గుడ్డివెలుగు కూడ కనిపించడం లేదు. రెండు పూటలా తిండి తినడమే గగనమయ్యింది. సరిగ్గా ఆ సమయంలోనే భార్యకు ఎబార్షన్ చెయ్యాల్సొచ్చింది. చెయ్యకపోతే ప్రాణాపాయమని డాక్టర్లు చెప్పేరు డబ్బు కావాలి. ఎవరిస్తారు? పరిష్కారం కనపడలేదు. కాని బలహీనమైన క్షణంలో అందరికీ యింతంత విషమిచ్చి తనూ తాగి యీ బాధలనుండి శాశ్వతంగా విముక్తి పొందాలనుకున్నాడు. గాని వెంటనే మనస్సు మేల్కొంది. తన

ఆలోచనలకు సిగ్గుపడ్డాడు. ఆ సమయంలోనే లోకంలో యింకా మంచితనం మంచుకుపోలేదనడానికి నిదర్శనంగా వొకప్పుడు వాళ్ళింట్లో పనిచేసే మనిషి యాభై రూపాయలు వర్ది అతని భార్య ప్రాణం కాపాడింది.

అప్పుడే అతనికి తెలిసొచ్చింది. బంధుప్రీతి లంచగొండితనం యీ దేశంలో పూర్తిగా రూపుమాసినా, పెరిగిపోతున్న జనాభావో అందరికీ వుద్యోగాలు రావడం చాల కష్టమని కష్టపడితే తిండికి లోటులేకుండా వుండటానికి అనేక మార్గాలున్నాయని తెలుసుకున్నాడు. భార్య కోలుకున్నాక పుట్టింటికి పంపించి తల్లిని తమ్ముళ్ళనూ మేనమామకు అప్పజెప్పి రైలెక్కాడు. అది వెళ్ళినంత దూరం టిక్కెట్ లేకుండానే ప్రయాణం చేసాడు. రైలు దిగింతరువాత నాలుగురోజులు తిండి లేకుండానే గడిపేడు. వారం తిరిగేసరికి వొక హోటల్లో క్లీనరుగా పని సంపాదించేడు. పనిమీద శ్రద్ధ చూపుతూ, చుట్టూ పరిస్థితులను అర్థంచేసుకుంటూ సర్వర్‌గా మారి కొంతకాలానికి ఆ హోటల్లోనే క్లర్కుగా అవతారం యెత్తి మూడేళ్ళకు వొచ్చిన్న హోటల్‌కి ప్రొప్రయిటర్ అయ్యాడు అక్కడితో ఆగలేదు కృషితో పాటు అదృష్టం కలిసొచ్చింది. నాలుగువారుల్లో వ్యాపారాన్ని విస్తృత పరిచేడు - వరకు వాణిజ్యవేత్తగా మారేడు. అంతడబ్బు గడించడంలో అతను స్మగులింగు కావి, బ్లాక్ మార్కెటింగు కావి, యితర అక్రమాలు గాని చెయ్యలేదు. అప్పటినుంటి ఇప్పటి వరకూ అతను తెలిసి చేసిన తప్పల్లా టికెట్ లేకుండా ప్రయాణం చేయడమే. రైల్వేవారు అందుకు శిక్షగా అతన్ని రైల్వే బోర్డ్ మెంబరుగా నియమించేరు. అది వేరే విషయమనుకోండి. ఇంతకూ ఆ వ్యక్తి యెవరో కాదు మీ యెదురుగా వున్న జగన్నాథరావే"

"ఇంతా యెందుకు చెప్పేనంటే.... నేటి యువకుల్లో నిరాశ, యే పని చెయ్యాలన్నా వెనుకంజ వేసే మనస్తత్వమూ పెరిగిపోతున్నాయి. బాధ్యతలు నిర్వర్తించడానికి అస్సలు ముందుకు రాలేకపోతున్నారు. నా జీవితాన్ని పరిశీలించి కొందరైనా యువకులు కార్యాదీక్షపరులై తమ జీవితాన్ని సుఖమయం చేసుకుంటే నాకు యీ రోజు జరిగిన సన్మానానికి నిజమైన ఫలితం దక్కిందనుకుంటాను." అంటూ ముగించేరాయన.

అక్కడనుండి వొచ్చేటప్పుడు చిన్న ఆలోచనలో పడ్డాడు. ఆయన జీవితంతో తన జీవితం పోల్చుకుంటున్నాడేమో. నిజానికి కూడా చాలా పోలికలున్నాయేమో అనిపించింది.

మేం యిద్దరం యెలిమెంటరీ స్కూలు దగ్గరనుండి కాలేజీవదిలిపెట్టేవరకు కలిసే చదువుతున్నాం పరీక్షల ముందు మా

యింటిదగ్గరే టీలు తాగుతూ తెల్లవార్లూ పుస్తకాలు ముందేసుక్కూర్చుని కబుర్లు చెప్పుకునే వాళ్ళం. మా స్నేహం పెరగడానికి మరో కారణం మా మధ్య వున్న ఆర్థిక సమానత్వం కావచ్చు. మధ్య తరగతి క్రింద అంచులు పట్టుకు వేళ్లాడుతున్న కుటుంబాలు మావి. నా అదృష్టం కొద్దీ చదువైన సంవత్సరానికే తన కూతుర్ని నాకు కట్టబెట్టి, మా వూళ్ళోనే వుద్యోగం యిప్పించాడు మా మేనమామ ఆ తరువాత నాన్న రిటైరయ్యాక అమ్మతో అన్నయ్య దగ్గర కెళ్ళిపోయారు. తమ్ముడి బాధ్యత నామీద పడింది. ఆ విధంగా బాధ్యతలు పంచేసుకుని వో పరిధిలో కాలం వెళ్ళబుచ్చుతున్నాను.

కాని చిన్నా జీవితం వ్యతిరేకంగా తయారయింది. పెళ్ళి పెళ్ళంటూ వొత్తిడి చేసే పెద్దలమాట కాదనలేక చదువవ్వగానే పెళ్ళి చేసుకున్నాడు. ఇంటిలో పెళ్ళి కెదిగిన చెల్లెళ్ళు, పైకి రావలసిన తమ్ముళ్ళు వున్నారు. ఎదిగొచ్చిన కొడుకు యేదో వుద్యోగం చేసి కాస్త చేదోడు వాదోడుగా వుంటాడనుకుంటే వీడికి కనుచూపు మేరలో అది వొచ్చే అవకాశం కనపడ్డం లేదాయే. పోనీ ప్రయత్న లోపమా అనుకుంటే అదేమి కాదు తెలిసిన వాళ్ళనూ, తెలియని వాళ్ళనూ కలుసుకుని వుద్యోగంకోసం అర్థించేడు. అందరూ చూద్దామన్నవాళ్ళే కాని సహాయం చేసినవాళ్ళు యెవరూ కనపడలేదు. డబ్బు పెట్టి కొనుక్కునే స్తోమతు లేకపోయినా వో సారి వెయ్యి రూపాయలు అప్పుచేసి యెవడి చేతిలోనో పెట్టి చేతులు కాల్చుకున్నాడు

చిన్నా వొక్కడే అయితే పరిస్థితి కొంతలో కొంత మెరుగ్గా వుండేదేమో! పెళ్ళాం కాపురానికి రావడంతో వొకరికి యిద్దరయ్యారు ముసలాయన మీద భారం. ఇంట్లో వాళ్ళకు కూడా చిన్నా మీద ఆశ సన్నగిల్లింది. వీడి అసమర్థత వల్లే వుద్యోగం రాలేదని అనుకోజాలరు కాని దేశ పరిస్థితులిలా వున్నాయని నమ్మలేకపోయారు. ఎవరైనా లోకంలో యేదేనా అంటే తన అసమర్థతను వేలెత్తి చూపిస్తున్నారని గోరంతలు కొండంతలుగా వూహించి బాధపడేవాడు. చిన్నా తల్లి కొడుకును యేమీ అనలేక తేరగా కూర్చుని తింటున్నావని కోడల్ని సాధించేది. అవిడేమో వీడి దగ్గర మొత్తుకుని యేడ్చేదట. ఓసారి అత్త కోడళ్ళ మధ్య పెద్ద గొడవ జరిగి చిన్నా పెళ్ళాం నూతిలో దూకేస్తే యిరుగు పొరుగు బయటకు తీసి నీళ్ళు కక్కించేరు. ఈ విధంగా వీడికి మనశ్శాంతి మరీ కరువయ్యింది. దాంతో కొంత కాలం భార్యను పుట్టింటికి పంపించేడు. పెళ్ళిచేసి వో అయ్యచేతికో పిల్లను పెట్టింతరువాత ఆడపిల్లను వాళ్ళు మాత్రం యెంత కాలం వుంచుకోగలరు? అదీకాక కట్నంగా యిచ్చిన డబ్బు చిన్నా వాళ్ళ యింటి ఖర్చులకు

వాడేసి కూతురిని పుట్టింటికి తన్ని తగి లేసేంచి వాళ్ళ కోపం అందుకే వో మంచి రోజు చూసి కూతురిని అత్తింట దిగబెట్టి వెళ్ళిపోయారు మళ్ళీ గొడవ మామూలే

నాకు ఖాళీ వున్నప్పుడల్లా నా దగ్గర కొచ్చి గడిపేవాడు చిన్నా. నాదగ్గరున్నంది వున్నపుడు యెటువంటి అరమరిక లేకుండా డబ్బు తీసుకునేవాడు నా పెళ్లైన కొత్తల్లో వాడి పరిస్థితికి మా అవిడ యెంతో సానుభూతి చూపించేది. కాని కాలం గడిచే కొద్దీ మా స్నేహం, నా దగ్గర డబ్బులు తీసుకోవడం అవిడకు అంతగా నచ్చలేదు నా ఆర్థిక పరిస్థితి గుర్తుచేసూ ఆ విషయం వొకటి రెండు సార్లు స్పష్టంగానే చెప్పింది.

అందుకే చిన్నా డబ్బుఅడిగిన విషయం సంగతి చెప్పలేదు ఆఫీసులో యివ్వగలిగిన వొకరిద్దరు కొలీగ్స్ని డబ్బు విషయం అడిగేను కానీ వాళ్ళు సారీ చెప్పి సారో సీనులో నటించేసేరు. సాయంకాలం ఆఫీసునుంచి వొస్తూ పెళ్లైం తరువాత అత్తగారింటికి వెళ్ళినప్పుడు మా మామ పెట్టిన వుంగరం తాకట్టు పెట్టి చిన్నాకు వంద రూపాయలు యిచ్చేను ఆ రాత్రే వాడు ట్రైన్ యెక్కి మద్రాసు వెళ్ళిపోయాడు తరువాత వుంగరం గురించి మా అవిడకూ నాకూ పెద్ద ఘర్షణ జరిగి వో పది రోజులు యెడమొహం పెడ మొహంగా వున్నాం

చిన్నా వెళ్ళింతరువాత వుత్తరాలు రాస్తుండేవాడు. ఒకనెల మాత్రం కొంత డబ్బు పంపినట్టు గుర్తు అర్నెల్లతరువాత మా వూరొచ్చి బెజవాడలో సెటిలవ్వాలనుకొంటున్నటు చెప్పి ఫామిలీని తీసి కెళ్ళిపోయాడు.

కొన్నేళ్ళు వుత్తరాల ద్వారా స్నేహాన్ని కాపాడుకొంటూ వొచ్చేం కాని, వుద్యోగరీత్యా వో రెండు మెట్లు పైకెక్కడంతో రోజంతా ఆఫీసునే అంటి పెట్టుకుని వుండాల్సొచ్చేది తీరిక వోపిక లేక వుత్తరాలు రాయడం కూడ మానేసాను అదీగాక యీ మధ్య చాలా వూళ్ళు తిరగాల్సొచ్చింది. ఇంటిలో కూడా అబ్బాయికోసం నాలుగుసార్లు చూసి లాభంలేక ఆపరేషన్ చేయించుకోవాల్సి వచ్చింది అడపిల్లల తండ్రిగా బాధ్యతలు పెరిగి వేరే ఆలోచనలకు అవకాశమే లేకపోయింది ఈ యిరవై యేళ్లల్లోనూ గుట్టు చప్పుడు కాకుండా సంసారం యీడ్చుకొచ్చేనే కాని పెద్దగా వెనకేసింది యేమీలేదు అప్పుడప్పుడు యెదిగొస్తున్న పిల్లల పెళ్ళిళ్ళ గుర్తుకు తెచ్చి తను భయపడి నన్ను భయపెడుతుంటుంది మా అవిడ. గుడ్డిలో మెల్ల యేమిటంటే పిల్లలు శ్రద్ధగా చదువుకుంటున్నారు పెద్దమ్మాయి బి ఏస్సీ పరీక్షలు రాస్తే రెండో అమ్మాయి ఎం.బి బియ్యేస్ మూడో సంవత్సరంలో వుంది మూడు నాలుగు హైస్కూలులో వున్నారు

తల్లి పోలికలు రావడంవల్ల పిల్లలు బాగుంటారు. అందుకే అమ్మాయి చదివిన కాలేజీలోనే లెక్చరరుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం అనే కుర్రాడు యిష్టపడ పెళ్లి చేసుకుంటానంటె మంచి సంబంధం అని ఒప్పుకున్నాం. వెనక పెద్దలు, అస్సలు కట్నం తీసుకోకపోవడం చిన్నతనమని చెప్పి పదివేలు అడిగేరు పెళ్ళి ఖర్చులూ అవీ యివీ కలసి పదిహేను దాటుతుందని లెక్కేసుకున్నాం. పి.ఎఫ్. మీదా, యిన్సూరెన్సుమీద లోను తీస్తే పన్నెండు వేలదాకా వొచ్చింది మిగిలింది యెలా పూడ్చుకోవాలా అని తలక్రిందులవుతుంటే చిన్నా హఠాత్తుగా గుర్తొచ్చేడు. అందుకే యీ రోజీ ప్రయాణం.

చిన్నా ఇంటి కొచ్చేక రాత్రంతా నిద్ర పోకుండా చిన్నప్పటి కబురులు యెన్నెన్నో చెప్పుకున్నాం. డబ్బు అడగటానికి మొహమాటపడ్డాను కాని యేలా గమనించేడో నా అవసరం, అమ్మాయి పెళ్ళి విషయం చెప్పగానే "డబ్బు యే మాత్రం కూడ బెట్టావ్ ?" అంటూ వివరాలడిగి అసలు విషయం నాచేత యధాలాపంగా చెప్పించేడు కాసేపు ఆలోచించి వో పదిహేను రోజుల్లో తనే స్వయంగా వొచ్చి ఆ డబ్బు సర్దుతానన్నాడు. ఆ మాట వినగానే నా గుండెలమీద బరువు తొలిగిపోయింది. ఆ రోజుకి వుండపొమ్మని యెంత బలవంతపెట్టినా చిన్నాగాడు చేస్తానన్న సహాయం గురించి మా ఆవిడకు చెపితేనే గాని ఆగలేననిపించి బయలుదేరాను.

